క్లుప్తంగా

అభివృద్ధి పనులు వేగవంతం



సూచనలిస్తున్న కమిషనర్

పుత్తూరు రూరల్: మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి ఆదేశించారు. శనివారం పుత్తూరు శ్మశాన వాటికలో ప్రహరీ గోడ నిర్మాణ పనులు, ఎన్జీఓ కాలనీలో జరుగుతున్న రోడ్డుపనులను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిపని నాణ్యతతో జరగాలని, అదే సమయంలో నిర్దేశిత సమయంలో పూర్తి కావాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

రోడ్డుపై ఒరిగిన చెరకు ట్రాక్టర్



నగరి: మున్సిపల్ పరిధి పళ్లిపట్టు రోడ్డులో శనివారం నెలవాయి షుగర్ ఫ్యాక్టరీకి వెళుతున్న చెరకు లోడ్ ట్రాక్టర్ పక్కకు ఒరిగి పోయింది. రద్దీగా ఉన్న రోడ్డుపై చెరకు ట్రాక్టర్ ఒరిగిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని ట్రాక్టర్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న హేమారెడ్డి

కార్వేటినగరం: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కార్యదర్శి కే.హేమారెడ్డి అన్నారు. శనివారం వార్షిక క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని కత్తెరపల్లె ఉన్నత పాఠశాల ఆవరణలో క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమన్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడు మురళీకృష్ణ మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు క్రీడల్లో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, టెన్నికాయిట్ పోటీలు ఉంటాయని తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటింగ్‌పై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏపీఓ ప్రసాద్

గంగాధరనెల్లూరు: ఈనెల 13న జరుగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడంపై ఓటర్లు అవగాహన కలిగి ఉండాలని వయోజనవిద్య ఏపీఓ ప్రసాద్ తెలిపారు. మండలంలోని అక్కదేవతలకండిగ, గంగాధరనెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఎమ్మెల్సీ ఓటింగ్‌పై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఏపీఓ, పర్యవేక్షకులు ఓబేద్ మాట్లాడుతూ ఓటరు తనకు నచ్చిన అభ్యర్థికి ప్రాధాన్యత క్రమంలో ఓటు వేయ వచ్చన్నారు. ఎన్నికల అధికారులు ఇచ్చే పెన్నుతో మాత్రమే సంఖ్యను వేయాల్సి ఉంటుందని తెలిపారు.

మెలకువలతో మేలైన దిగుబడులు



సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

పాలసముద్రం : వేరుశనగ సాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు పొందవచ్చని డీఆర్‌సీ, డీటీసీ సహాయ వ్యవసాయ సంచాలకులు గోపాల్, టీవీ నాగపద్మిని తెలిపారు. శనివారం వెంగళరాజుకుప్పంలో వేరుశనగ, చెరకు పంటలను వారు క్షేత్ర స్థాయిల్లో పరిశీలించి రైతులతో మాట్లాడారు. అపరాలతో పంట మార్పిడీ చేయాలని తెలిపారు. వేరుశనగ కోత, నిల్వలో జాగ్రత్తలు, వరి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,యాజమాన్యాలను వివరించారు.

ఆధునికీకరణ బాట.. సేవలకు బాసట



చికిత్స కోసం ఆస్పత్రిలో వేచి ఉన్న రోగులు



చికిత్స చేయించుకుని బయటకు వస్తున్న రోగులు

- విజయపురం పీహెచ్‌సీ ఆధునికీకరణ
- అందుబాటులో మెరుగైన వైద్యసేవలు
- గ్రామీణులకు 24/7 వైద్య సదుపాయం

యంత్రాలు, వైద్యులు, ల్యాబ్‌ల లేమి.. జీర్ణావస్థలో భవనం.. అపరిశుభ్ర వాతావరణం.. ఒకప్పుడు ఇటువంటి అసౌకర్యాలు లెక్కకు మించి ఉండేవి విజయపురం ప్రభుత్వ దవాఖానాలో. కానీ పరిస్థితి మారింది. ప్రస్తుత సర్కారు పీహెచ్‌సీలో సమస్యలకు చరమగీతం పలుకుతూ ఆధునికీకరణకు పెద్దపీట వేస్తూ కార్పొరేట్ తరహాలో వసతులు, వైద్యులను సమకూర్చింది. వెరసి సర్వజనులకు ప్రైవేటుకు మిన్నగా వైద్యసేవలు అందుతున్నాయి.

నగరి: ప్రజలకు మేలు చేయాలన్న చిత్తశుద్ధి పాలకుల్లో ఉంటే అడ్డు ఏదీ ఉండదని ప్రస్తుత ప్రభుత్వ పనితీరు నిరూపించింది. గ్రామీణులకు నాణ్యమైన వైద్యసేవలు అందించడంపై వైఎస్సార్ సీపీ సర్కారు ప్రత్యేక దృష్టి సారిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో, పీహెచ్‌సీల్లో వైద్యసిబ్బంది అందుబాటులో ఉండేవారు కాదు. ఆస్పత్రి భవనాలు కూడా శిథిలావస్థకు చేరాయి. ఒకవేళ ఆస్పత్రికి వెళ్లి పరిసరాల్లో కాసేపు నిలుచుకోవాల్సి వచ్చినా నరకమే. పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందని ద్రాక్షగానే మిగిలిపోయాయి. ఈ దుర్భర పరిస్థితులకు చెక్ పెడుతూ నేటి సర్కారు నాడు-నేడు పథకంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధునికీకరిస్తోంది. ఇందులో భాగంగా విజయపురం పీహెచ్‌సీకి సకల సౌకర్యాలు సమకూరాయి. దీంతో నేడు వైద్యులు, సేవలు అందుబాటులోకి వచ్చాయి.

నాడు అత్యవసర చికిత్సకూ నగరికి..

విజయపురం మండలంలో 25 పంచాయతీలు 116 గ్రామాలున్నాయి. సుమారు 22 వేల మంది జనాభా ఉన్నారు. మండల ప్రజలకు వైద్యసేవలు అందించడానికి 1984లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. ఈ ఆస్పత్రిలో చిన్న వ్యాధులకు మాత్రమే వైద్య సేవలు అందేవి. అత్యవసరమైన చికిత్స కోసం కూడా నగరి, పుత్తూరుకు పరుగులు తీయాల్సి వచ్చేది. గర్భిణులకు అత్యవసర చికిత్సలకు కూడా నగరికి వెళ్లాల్సి వచ్చేది. దీంతో గర్భిణులు, రోగులు చాలా ఇబ్బందులు పడేవారు.

రూపు రేఖలు మారిన పీహెచ్‌సీ

2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆస్పత్రి రూపరేఖలు మార్చేసింది. ఇద్దరు వైద్యులు, సిబ్బందిని నియమించింది. దీంతో 24 గంటలు వైద్యసేవలతోపాటు, అత్యాధునిక పరికరాలతో రక్త పరీక్షలు అందుబాటులోకి వచ్చాయి. అంతే కాకుండా అత్యవసర పరిస్థితిలో రోగులకు తరలించడానికి 108 వాహనం, ప్రతి నెలా ఇంటి వద్దే వైద్య పరీక్షలు చేసి మందులు ఇవ్వడానికి 104 వాహనం అందుబాటు తీసుకొచ్చారు. దీంతో ఆస్పత్రిలో వైద్య సేవలు మెరుగుపడ్డాయి. రోజు 200 మంది వరకు రోగులు వైద్యసేవలు పొందుతున్నారు. షుగర్, బీపీ, కీళ్లనొప్పులు, అసిడిటీ, థైరాయిడ్ తదితర వ్యాధులతో బాధపడేవారు ఎక్కువగా వస్తున్నారు. ఆస్పత్రిలో ఏ మందుల కొరత ఉన్నా రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా అందజేస్తున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తాం



గతంలో కంటే ఆస్పత్రిలో వసతులు మెరుగుపడ్డాయి. ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువచ్చాం. ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగికి వైద్యం అందలేదన్న మాట వినిపించకుండా వైద్యసేవలు అందిస్తున్నాం. రక్తపరీక్షలు కూడా వైద్యశాలలోనే చేస్తున్నాం. అవసరమైన మేరకు వైద్యసిబ్బంది ఉన్నారు. ప్రతిరోజు 200 మందికి పైగా పేషంట్లు వస్తున్నారు.

–సోమశేఖర్, మెడికల్ ఆఫీసర్, విజయపురం

వైద్యసేవలు మెరుగుపడ్డాయి



టీడీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ ఆస్పత్రులు పూర్తి స్థాయిలో నిర్వీర్యం అయ్యాయి. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వం ఆస్పత్రులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. అన్ని రకాల వైద్య సేవలు ఆస్పత్రిలోనే అందుబాటులో ఉన్నాయి. గతంలో కంటే ఆస్పత్రి ఎంతో మెరుగుపడింది. ఇదివరలో జలుబు, జ్వరం వచ్చినా నగరి, పుత్తూరుకు వెళ్లాల్సి ఉండేది. ప్రస్తుతం ఆ బాధ తప్పింది.

–ప్రసన్న, విజయపురం

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న జడ్జి లీలాశ్యామ సుందరి



సదస్సులో పాల్గొన్న అంగన్‌వాడీ వర్కర్లు

పుత్తూరు రూరల్: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉంటూ అన్ని రంగాల్లోనూ రాణించాలని పుత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లీలాశ్యామసుందరి సూచించారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా స్థానిక సీడీపీఓ కార్యాలయంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ మహిళలకు సమస్యలను అధిగమిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. హైకోర్టులో డ్రైవర్ ఉద్యోగాలకు మహిళలను నియమించడం గర్వించదగ్గ విషయమన్నారు. ఆధునిక సమాజంలోనూ మహిళల పట్ల హింసాత్మక సంఘటనలు జరుగుతుండడం దురదృష్టకరమని తెలిపారు. మహిళలకు భారత రాజ్యాంగంలోని 15 ఆర్టికల్ రక్షణ కల్పిస్తుందని పేర్కొన్నారు. ఫోక్సో చట్టం ద్వారా మహిళలను లైంగిక హింస నుంచి, డీవీసీ చట్టం గృహ హింస నుంచి రక్షణ కల్పిస్తుందని వివరించారు. మహిళలు పని చేసే సంస్థల్లో లైంగిక దాడులు జరగకుండా కమిటీలు ఏర్పాటు, లింగ నిర్ధారణ పరీక్షలు, స్త్రీ శిశు భ్రూణహత్య చట్టాల పట్ల మహిళలు అవగాహన ఏర్పరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ కె.పద్మజ, సూపర్‌వైజర్లు గీతాంజలి, కిరణ్మయి, భార్గవి, కృష్ణవేణి, రోజారమణి, అనిత, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంపై ఆరోపణలు చేస్తే బుద్ధి చెబుతాం

- నారాయణస్వామి నేతృత్వంలో జీడీనెల్లూరు అభివృద్ధి
- కులాల మధ్య చిచ్చుపెడితే ఊరుకోం
- ఈదురువారిపల్లె గ్రామస్తుల హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి

కార్వేటినగరం: మాల,మాదిగలు అన్నదమ్ములా కలిసి ఉన్నచోట వర్గీకరణ తీసుకు రావద్దని, నియోజకవర్గంలో అందరూ ఒక్కటేనని ఏఎంసీ వైస్ చైర్మన్ మంగళిగిరి గోపి స్పష్టం చేశారు. శనివారం మండల పరిధిలోని ఈదువారిపల్లి ఏఏడబ్ల్యూలో గ్రామ పెద్దలతో కలసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో, నియోజకవర్గంలో ఎక్కడా మాదిగ-మాలలు అన్న తారతమ్యం లేకుండా అందరూ ఒక్కటై కలసి ఉన్నారని తెలిపారు. కృష్ణా జిల్లా నుంచి ఈదువారిపల్లికి కోడలుగా వచ్చిన కంటిపులి కరుణశ్రీని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి సర్పంచ్‌గా గెలిపించుకున్నారని, సర్పంచ్‌గా గెలిచినప్పటి నుంచి కులాల మధ్య చిచ్చు పెడుతూ గ్రామాలను అభివృద్ధి చేయకుండా గాలికొదిలేశారని ఆరోపించారు. సర్పంచ్‌గా అవకాశాన్ని కల్పించిన మంత్రి కుటుంబంపై విమర్శలు చేయడం మంచిది కాదని హితవు పలికారు. ఏఎంసీ వైస్ చైర్మన్ పదవిని మాదిగలకు ఇచ్చిన ఘనత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికే దక్కుతుందన్నారు. అలాంటి కుటుంబంపై ఆది-ఆంధ్రులను తొక్కేస్తున్నారని కృష్ణాజిల్లాలో చేరుకుని సామాజిక మాధ్యమాల ద్వారా విమర్శలకు దిగడం మంచిది కాదని హెచ్చరించారు. పంచాయతీ ప్రథమ పౌరురాలిగా గ్రామాలు అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాల్సిన సర్పంచ్ అందుబాటులో లేకుండా ప్రతి ఒక్కరిని పేరు పేరున పలకరిస్తూ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్న ఉప ముఖ్యమంత్రి కుటుంబాన్ని విమర్శిస్తే ఊరుకో బోమని గ్రామ పెద్దలు హెచ్చరించారు. గ్రామానికి శ్మశానవాటిక ఏర్పాటుకు మంత్రి ప్రత్యేక చొరవ చూపుతున్నారని గుర్తు చేశారు. కంటిపులి జనార్దన్ జిల్లా వైద్యాధికారిగా చేసిన సేవలను గుర్తించే కరుణశ్రీని సర్పంచ్‌గా గెలిపించామని, ఆమె తమ ఆశయాలను తుంగలో తొక్కి దళితులకు పెద్ద దిక్కైన ఉప మంత్రిపై విమర్శలు చేస్తున్నారని, అలాంటి వాటికి స్వస్తి చెప్పకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పాలసముద్రం: ఈనెల 13న జరుగనున్న గ్రాడ్యుయేట్ టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ బాబు తెలిపారు. శనివారం పాల సముద్రం ఉన్నత పాఠశాల ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాన్ని ఎస్‌ఐ బి.సురేష్‌తో కలసి పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సౌకర్యాలు కల్పించాలని ఎస్‌ఐకు సూచించారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను అందుకున్న విద్యార్థులు

పుత్తూరు రూరల్: పుత్తూరు ఎస్‌ఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం విజయ సాధన స్టడీ మెటీరియల్‌ను శనివారం వితరణగా అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులుశెట్టి తెలిపారు. పాఠశాలలోని 36 మంది విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు రూ.5100 విలువ చేసే మెటీరియల్‌ను కొనుగోలు చేసి అందజేసినట్లు వివరించారు. ఈఏడు పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు తిరుపతి డీఈఓ నేతృత్వంలో నిపుణులచే ప్రత్యేకంగా స్టడీ మెటీరియల్ తయారు చేశారని పేర్కొన్నారు. విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని వంద శాతం ఫలితాలు సాధించాలని కోరారు.

సస్యరక్షణపై అవగాహన

నిండ్ర: అత్తూరు గ్రామంలో శనివారం రైతులకు పంటల సస్యరక్షణపై మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ అవగాహన కల్పించారు. పొద్దుతిరుగుడు, వేరుశెనగ పంటలను ఆశించే పచ్చ పురుగు నివారణ చర్యలను వివరించారు. మందుల పిచికారీ సమయంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

వేడుకగా శని ప్రదోష పూజలు





నగరి : అభిషేకం, వెదురుకుప్పం : ప్రత్యేకాలంకరణ

నగరి: పట్టణంలోని శ్రీకరకంఠేశ్వరస్వామి ఆలయంలో శనివారం త్రయోదశి సందర్భంగా శని ప్రదోష పూ జలు ఘనంగా నిర్వహించారు. కరకంఠేశ్వరస్వామి సన్నిధికి ఎదురుగా ఉన్న నందీశ్వరునికి, శనీశ్వరునికి ప్రత్యేక అభిషేకాలు చేసి అలంకరించారు. భక్తులు దీపాలు వెలిగించి పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు దుర్గా ప్రసాద్ దోష నివారణ పూజలు చేశారు. ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొండమల్లీశ్వరస్వామి ఆలయంలో..

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై వెలసి ఉన్న శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం ప్రదోషకాల పూజలు వేడుకగా నిర్వహించారు. శివునికి, నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం ప్రదోష పూజలనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. ఆలయ ఆవరణలో ఉన్న పంచముఖ ఆంజనేయస్వామికి పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



పాలసముద్రం : రికార్డులు పరిశీలిస్తున్న కృష్ణారెడ్డి

పాలసముద్రం: చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు తప్పక వేయించాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల పరిశీలకుడు కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని శ్రీకావేరి రాజుపురం, కన్నికాపురంలో ఇంటింటికీ వెళ్లి చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశార లేదా అని క్షేత్రస్థాయిల్లో పరిశీలించారు. వ్యాధి నిరోధక టీకాల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధులు టీబీ, పోలియో, కామెర్లు, డిఫ్తీరియా, కంఠసర్పి, ధనుర్వాతం, నిమోనియా, విరేచనాలు, ఆటలమ్మ, రుబెల్లా, మెదడువాపు, కంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు ముందస్తుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. వ్యాధి నిరోధక టీకాల రికార్డులను పరిశీలించారు. సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, సుశీల, ఎంఎల్‌హెచ్‌వో సునీత, ఆశా, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

గంగాధరనెల్లూరు: చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ కోరారు. మండలంలోని బంగారెడ్డిపల్లె గ్రామంలో శనివారం వ్యాధి నిరోధక టీకాల ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ బిడ్డలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని తెలిపారు. ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే పట్టించాలన్నారు.

సేవే పరమావధి కావాలి



మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ విష్ణువర్మ

నగరి: న్యాయసేవలను ప్రజలకు చేరువ చేసేందుకే పారాలీగల్ వలంటీర్లను నియమించినట్లు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.విష్ణువర్మ తెలిపారు. శనివారం నూతనంగా ఎంపిక చేసిన పారాలీగల్ వలంటీర్లతో ఆయన సమావేశమయ్యారు. వారికి విధులు, బాధ్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, న్యాయ సేవలకు మధ్య వారిధిగా పారా లీగల్ వలంటీర్లు పనిచేయాల్సి ఉంటుందన్నారు. జీతాలు ఉండవని సేవాభావంతో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పదవ తరగతి పాసై, ఎలాంటి వివాదాలు, సమస్యల్లో లేనివారినే పారాలీగల్ వలంటీర్లుగా నియమించినట్లు తెలిపారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.రామ శాంతి, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాలకు అంకురార్పణ



ఉత్సవమూర్తులకు హారతి

వెదురుకుప్పం: మండలంలోని చిన్నకొమరగుంటలో వెలసి ఉన్న శ్రీపద్మావతి ఆండాళ్ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆరవ వార్షి కోత్సవాలకు శనివారం సాయంత్రం ఘనంగా అంకురార్పణ జరిగింది. స్వామి వారి ఉత్స మూర్తులను ఆలయ ఆవరణలో వేంచేపు చేసి అధ్యయ నోత్సవం, సమ్మాళ్వార్ పరమపద పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు వేకువజామునే ఆలయ ప్రధాన అర్చకులు జగన్ మోహన్‌స్వామి ఆధ్వర్యంలో ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి భక్తి ప్రపత్తులతో పాలాభిషేకం చేశారు. పట్టుపీతాంబరాలతో స్వామి వారిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో భాగంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఉత్సవాలు 10వ తేదీ వరకు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలి





నగరి: నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు, పుత్తూరులో..

నగరి: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. శనివారం టవర్‌క్లాక్ సెంటర్ వద్ద గ్యాస్ ధరల పెంపుపై సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గ్యాస్ ధరలను తగ్గించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కోదండయ్య మాట్లాడుతూ 2014లో రూ.410 ఉన్న సిలిండరు ధర నేడు రూ.1150 తీసుకొచ్చిన ఘనత నరేంద్ర మోదీకే దక్కుతుందన్నారు. దేశంలో వంట గ్యాస్ ధర రోజు రోజుకూ పెరుగుతోందని తెలిపారు. ప్రతి సారి రూ.50కి తగ్గకుండా పెంచుకుంటూ పోతోందన్నారు. పెంచిన గ్యాస్ ధరను తగ్గించకపోతే దేశ ప్రజలు మోదీకి తగిన బుద్ధి చెబుతారన్నారు పార్టీ నాయకులు వేలన్, బాషా, విజయ్ కుమార్, శేఖర్, సతీష్, బుజ్జి పాల్గొన్నారు.

పుత్తూరు రూరల్: పెంచిన వంట గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సీపీఎం నాయకులు శనివారం పట్టణంలో ఆందోళన చేశారు. గ్యాస్ సిలిండర్‌ను మోస్తూ ఈ భారాన్ని తాము మోయలేమంటూ నినాదాలు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరను ఒక్కసారిగా రూ.50 పెంచడం దారుణమన్నారు. నాయకులు యూనిస్ బాషా, సుబ్రమణ్యంపిళ్లై, మోసస్, రమేష్, ఆటో యూనియన్ నాయకులు రమేష్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పేర్నాటిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి



వడమాలపేట: బ్యాలెట్ నమోనాను ప్రదర్శిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి



నగరి: కరపత్రాలు పంచుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



జీడీనెల్లూరు: ఓటరు జాబితాను విడుదల చేస్తున్న పూర్ణచంద్రారెడ్డి

నగరి: వైఎస్సార్‌సీపీ బలపరిచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని మెజారిటీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. శనివారం మండలంలోని మాంగాడు గ్రామంలో పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి పేర్నాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి మెజిరిటీతో గెలిపించాలని కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓటుతో మద్దతు పలకాలన్నారు. యువత, నిరుద్యోగులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కరపత్రాలను, బ్యాలెట్ నమూనాను అందజేశారు. పార్టీ నాయకులు భాస్కర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, జగదీష్‌రెడ్డి, ప్రకాష్, చంద్రారెడ్డి, వెంకటేశులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా విడుదల

గంగాధరనెల్లూరు: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎల్.పూర్ణచంద్రారెడ్డి కోరారు. గంగాధరనెల్లూరులో శనివారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, వైస్‌ఎంపీపీ హరిబాబు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఏకాంబరం, జేసీఎస్, మండల ఇన్‌చార్జ్ వెంకటేశులురెడ్డి, మాజీ కన్వీనర్ సురేంద్రరెడ్డి, గోవిందరెడ్డి, వెంకటేశులురెడ్డి పాల్గొన్నారు.

బ్యాలెట్ నమూనా ప్రదర్శన

వడమాలపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత రాంప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వైఎస్సార్ సీపీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేర్నేటి వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చారని, మంచి సేవాభావం కలిగిన వ్యక్తి అని తెలిపారు. మండలంలో 812 ఓట్లు ఉన్నాయని, ఓటర్లందరూ పేర్నేటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా ప్రచారం చేయాలన్నారు. నమూనా బ్యాలెట్ పత్రాలను ప్రదర్శించారు. డీసీసీబీ డైరెక్టర్ కరుణాకర్‌చౌదరి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, వైస్ ఎంపీపీలు ఉపేంద్ర, లోకేష్‌రెడ్డి, సర్పంచులు అంజెమ్మ, శ్రీవిద్య, నాయకులు సురేష్‌రాజు, యాదవేంద్ర రెడ్డి, మునిబాబు తదితరులు పాల్గొన్నారు.